క్లుప్తంగా

రేపు రక్తదాన శిబిరం

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 2వ వార్డు కార్పొరేటర్ చిట్ల దివాకర్ జన్మదినం సందర్భంగా ఈ నెల 23న మేగా రక్తదాన శిబిరం ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రగతినగర్‌లోని రాఘలైన్‌లో రాఘవేంద్ర రెసిడెన్సీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నాట్లు సంక్షేమ సంఘం నాయకులు పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఈ క్యాంపు కొనసాగుతుందన్నారు.

మైనంపల్లికి ఎమ్మెల్సీ పరామర్శ

జీడిమెట్ల: మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కాలికి శస్త్ర చికిత్స జరిగిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. సివిల్ సప్లై మాజీ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ నాగరాజు యాదవ్ పరామర్శించిన వారిలో ఉన్నారు.

జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్‌గా క్రాంతికుమార్



జగద్గిరిగుట్ట: జగద్గిరి గుట్ట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా క్రాంతికుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో అడిషనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌గా విధులు నిర్వర్తించారు. సుమారు రెండున్నర సంవత్సరాలుగా జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించిన సైదులు సీపీఓ, క్రైం బ్రాంచ్‌కి బదిలీ అయ్యారు.

భద్రతపై అవగాహన



గ్యాంజెస్ వ్యాలీ స్కూల్‌లో భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ చంద్రశేఖర్

నిజాంపేట్: నిజాంపేట్‌లోని గ్యాంజెస్ వ్యాలీ స్కూల్‌లో శుక్రవారం పోలీసులు విద్యార్థులకు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి ఏసీపీ చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై ఫిజికల్ సేఫ్టీ, సైబర్ సెఫ్టీ, మెంటల్ హెల్త్, యాంటీ డ్రగ్, ఫైర్ సెఫ్టీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా పై విషయాల్లో ఇబ్బందులు పడుతుంటే వెంటనే తమను సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చన్నారు. పాఠశాల సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యులు ఎప్పటికప్పుడు విద్యార్థుల భద్రతపై దృష్టి సారించాలని ఏసీపీ సూచించారు.

ఓయూ కార్యక్రమాలకు మంత్రుల గైర్హాజరు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో జరిగిన వివిధ కార్యక్రమాలకు రాష్ట్ర మంత్రులు గైర్హాజరయ్యారు. శుక్రవారం ఓయూలో ఏర్పాటు చేసి ఇండో–పసిఫిక్ అధ్యయన కేంద్రం ప్రారంభానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన మహనీయుల జయంతి ఉత్సవాలకు హోంమంత్రి మహ్మద్ అలీతో పాటు మంత్రులు కొప్పుల ఈశ్వర్, సత్యవతిరాథోడ్ హాజరుకావలసి ఉంది. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీతో పాటు పెంచిన డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఫీజుల పై విద్యార్థి సంఘాల ఆందోళన కారణంగా మంత్రుల సెక్యూరిటీ పై ఇంటలిజెంట్స్ వర్గాల అభ్యంతరంతో గైర్హాజరైనట్లు సమాచారం.

దిశ ఆధ్వర్యంలో నేడు జాబ్‌డ్రైవ్

సనత్‌నగర్: డాన్‌బాస్కో అనుబంధ సంస్థ అయిన దిశ ఆధ్వర్యంలో శనివారం జాబ్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వినోద్‌కుమార్, ఐవన్‌వాజ్, స్టీవెన్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఎర్రగడ్డ రైతుబజార్ ఎదురుగా గల సెయింట్ థెరిస్సా చర్చి ప్రాంగణంలో ఉదయ 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జాబ్ డ్రైవ్ కొనసాగుతుందన్నారు. బ్యాంకింగ్ రంగ ఉద్యోగాలల కోసం జరిగే ఇంటర్వ్యూలకు ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఆపై విద్యాభ్యాసం పూర్తిచేసిన వారు పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 94905 17219, 94946 98219 నెంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు.

24 నుంచి టెక్నోస్మానియా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ టెక్నాలజీ కాలేజీలో ఈ నెల 24 నుంచి టెక్నోస్మానియా–2023 కార్యక్రమం ప్రారంభంకానున్నట్లు ప్రిన్సిపల్ ప్రొ.చింత సాయిలు శుక్రవారం తెలిపారు. నిత్యం తరగతి చదువులు, సెమిస్టర్ పరీక్షలు, ప్రయోగాలతో బిజిగా గడిపే టెక్నాలజీ ఇంజినీరింగ్ విద్యార్థులకు మానసిక ఉల్లాసానికి ప్రతి ఏటా నిర్వహించే టెక్నోస్మానియాకు ఈ ఏడాది కాలేజీ ఆవరణలో ఏర్పాటు పూర్తి చేసిన్నట్లు వివరించారు.మూడు రోజులపాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

మూగజీవాల దాహం తీరలె!

మట్టిపాత్రలను మూలన పడేసిన వైనం



వేసవి కాలంలో పక్షుల దాహం తీర్చేందుకు మట్టి పాత్రాలను తయారు చేయించిన నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ వాటిని పక్కకు పడేసింది. కార్పొరేషన్ పరిధిలోని పలు సెంటర్లల్లో, పార్కుల్లో మట్టి పాత్రాలను ఏర్పాటు చేసి పక్షులు, కుక్కల దాహం తీర్చేందుకు ఏర్పాట్లు చేశారు. కాని అధికారులు ఎక్కడ ఇలాంటి పాత్రాలను ఏర్పాటు చేయలేదు. పలువురు జంతుప్రేమికులు సైతం పక్షులు, కుక్కలకు వేసవిలో దాహం తీర్చేందుకు ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రాలు సైతం సమర్పించారు. పక్షులు, కుక్కల కోసం తయారు చేయించిన మట్టి పాత్రలు మాత్రం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ప్రాంగణంలో ఓ మూలనా పడేయడం గమనార్హం. – నిజాంపేట్

ఖాళీ దొరికితే ఏరేస్తాం.!

టెక్కీల ప్లాస్టిక్ క్లీనప్ డ్రైవ్

వారంతా ఎంఎన్‌సీ కంపెనీ ఉద్యోగులు.. కొంత మంది కలిసి ఒక గ్రూప్‌గా ఏర్పడ్డారు.. ఖాళీ సమయం, వారాంతాల్లో సమాజం కోసం ఏదైనా చేయాలనుకున్నారు. అనుకుందే తడవుగా ఖాళీ సమయంలో రోడ్ల పక్కన, మైదానాల్లో ఉన్న ప్లాస్టిక్‌ను ఏరివేస్తున్నారు. ప్లాస్టిక్‌ను వాడొద్దని అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు. శుక్రవారం ఉదయం కుత్బుల్లాపూర్‌లోని హెచ్‌ఎంటీ మైదానంలో ప్లాస్టిక్ చెత్తను తొగగిస్తుండగా సాక్షి వారిని పలకరించింది. వారి పేర్లు అంకుర్, కోటిరెడ్డి, రుచిత, శ్రీకాంత్, కృష్ణ, వాసవి, విజయ్ శశాంక్, సిమ్రాన్, పూనమ్‌లుగా పరిచయం చేసుకున్నారు. వారంతా హైటెక్‌సిటీలోని మైండ్‌స్పేస్‌లో ఉన్న సాప్‌కాల్లిడస్ పరిశ్రమ ఉద్యోగులని తెలిపారు. ఏది ఏమైనా వేలల్లో జీతాలు వస్తున్నప్పటికీ వారు సమాజ సేవ కోసం చేసే పనిని మనం అభినందించాల్సిందే. వీరిలాగే యువత 'మన దేశం – మన ప్రగతి'కోసం ఆలోచిస్తే బాగుంటుంది కదా.! – జీడిమెట్ల



ఇప్పటికైనా స్పందిస్తారా.?



శిథిలమైన మ్యాన్‌హోల్‌తో నెల రోజులుగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా అధికారులకు స్పందించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలోని ఆదిత్య గార్డెన్స్‌లో ప్రధాన రహదారిలో నెల రోజుల క్రితం భారీ వాహనాల రాకపోకలతో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ ధ్వంసమైంది. ఈ విషయమై స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదు. దీంతో తరచూ మ్యాన్‌హోల్ గుంతలో వాహనాలు ఇరుక్కుంటూ వాహనదారులు గాయాల పాలవుతున్నారు. శుక్రవారం ఓ ట్రాలీ ఆటో అందులో ఇరుక్కుంది. అతికష్టం మీద దానిని బయటకు తీశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు. – నిజాంపేట్

ఏం చేసినా పట్టేస్తుంది..

- నిఘా నేత్రంలో కాలనీలు, ప్రధాన రహదారులు
- ప్రధాన రోడ్లపై 69 సీసీ కెమెరాలు ఏర్పాటు
- ఇటీవల పని చేయని కెమెరాలకు మరమ్మతులు
- దోపిడీ, దొంగతనాలరు కట్టడి చేసేందుకు ప్రత్యేక చర్యలు



అయోధ్యనగర్ చౌరస్తాలో సీసీ కెమెరాలకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: నిఘా నేత్రాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. రోజురోజుకు జరుగుతున్న దోపిడీలు, దొంగతనాలు ఇతరత్రా నేరాలపై పట్టు సాధించేందుకు మరింత పకడ్బందీగా ఉండేందుకు చర్యలు చేపట్టారు. ముఖ్యంగా ప్రధాన రహదారి నర్సాపూర్‌పై వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉండగా అక్కడక్కడ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. వాహనం ఎటువైపు నుంచి ఎటువైపు వెళ్తుంది.? రాంగ్ రూట్లో వచ్చారా.? ప్రమాదం ఎలా జరిగింది.? అన్న విషయాలను ×నిఘా×లో కనిపెడుతున్నారు.

- ఒకవైపు జీడిమెట్ల పారిశ్రామికవాడ మరోవైపు రాష్ట్ర రహదారి. ఇంకోవైపు కాలనీలు ఇలా అన్ని కాలనీలకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరుపై జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ పవన్ ఇటీవల సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. పలు సీసీ కెమెరాలు పనిచేయకుండా ఉన్న విషయాన్ని గుర్తించారు. వెంటనే వాటి మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇప్పటికే ప్రధాన రోడ్లపై 69 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఏ ప్రమాదం జరిగినా క్షణాల్లో పోలీసులు స్పాట్‌కు వెళ్లేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఇటీవల అంతర్రాష్ట్ర దొంగల సంచారం, మారణాయుధాలతో పట్టుబడ్డ విషయం విదితమే.

ఎక్కడికక్కడ కెమెరాలకు మరమ్మతులు...

పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించిన సిబ్బంది మొత్తం 22 కెమెరాలు పనిచేయడం లేదని గుర్తించి వాటి మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తా రోడ్డు నుంచి అయోధ్యనగర్ మూలమలుపు వరకు మొత్తం 12 సీసీ కెమెరాలు ఉన్నాయి. వాటిలో ఆరు సీసీ కెమెరాలు పనిచేయక పోవడంతో వాటికి శుక్రవారం మరమ్మతులు చేశారు.

- ప్రధానంగా సుభాష్‌నగర్, అయోధ్యనగర్, సుచిత్ర, కుత్బుల్లాపూర్ ఈ నాలుగు రహదారులకు అనుసంధానంగా ఈ సీసీ కెమెరాలు పనిచేస్తూ వస్తున్నాయి. గాజులరామారం ఎక్స్ రోడ్డు నుంచి జీడిమెట్ల బస్‌డిపో వరకు మొత్తం 15 కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటిలో పని చేయని ఏడు కెమెరాలు పునరుద్ధరించారు.
- గాజులరామారం గ్రామం వరకు మొత్తం 21 కెమెరాలు ఉండగా వాటిలో 15 వివరాలు పని చేస్తున్నాయి. మరో ఆరు కెమెరాలకు మరమ్మతులు చేపట్టారు.
- కుత్బుల్లాపూర్ ఎక్స్ రోడ్డు నుంచి జీడిమెట్ల పోలీస్ స్టేషన్ హెచ్‌ఎంటీ మెయిన్ రోడ్డులో మొత్తం 8 కెమెరాలు ఉండగా 7 కెమెరాలు పని చేస్తున్నాయి.
- ఐడీపీఎల్ చౌరస్తా నుంచి కుత్బుల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం వరకు ప్రధాన రోడ్డుపై మొత్తం 13 కెమెరాలు ఉన్నాయి. అందులో రెండు పనిచేయకపోవడంతో వాటికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తెచ్చారు.

ఠాణా పరిధిలో 24/7 నిఘా...



జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్కడైనా సంఘటన జరిగితే ముఖ్యంగా మా దృష్టి మొత్తం సీసీ కెమెరాలపై పెడతాం. అనుమానాస్పద వ్యక్తుల సంచారం, కొత్త వాహనాల రాకపోకలు, సంఘటన జరిగిన తీరు పరిశీలిస్తే క్లారిటీ వచ్చేస్తుంది. ముఖ్యంగా సీసీ కెమెరాలు ఏర్పాటుకు సంక్షేమ సంఘాలు చక్కటి సహకారం అందిస్తున్నాయి. ప్రధాన రోడ్డుపై జరిగే రోడ్డు ప్రమాదాలు సీసీ కెమెరాల ద్వారా గుర్తించి కేసులు నమోదు చేసి బాధితులకు న్యాయం చేస్తున్నాం. ప్రతి కాలనీలో సీసీ కెమెరా ప్రాధాన్యత విషయంపై ఇప్పటికే అవగాహన సదస్సులు నిర్వహించాం. మరికొన్ని ప్రాంతాల్లో ఇదే తరహాలో పూర్తిచేసే దిశగా అడుగులు వేస్తున్నాం. 24/7 స్టేషన్లో ఉన్న మా సిబ్బంది నిఘ పెడుతుంది.

– పవన్, జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్

మార్కెట్‌లో రంజాన్ సందడి



ముస్లిం పండుగలలో అతి పవిత్రమైన పండుగ రంజాన్. శనివారం రంజాన్‌ను పురస్కరించుకుని శుక్రవారం ముస్లింలు పండగ షాపింగ్ చేశబూరు. షాపూర్‌నగర్ మార్కెట్ ముస్లింలతో కిటకిటలాడింది. పండగ సందర్భంగా మార్కెట్‌లో పదుల సంఖ్యలలో షాపులు వెలిసాయి. సేమియా, డ్రై ఫ్రూట్స్, ఖర్జూరం, రోల్డ్ గోల్డ్ ఆభరణాలు, దుస్తులు కొనుగోలు చేస్తూ కనిపించారు. – సుభాష్‌నగర్





అన్ని కులాలకు తగిన ప్రోత్సాహం



నాయీబ్రాహ్మణ సంఘం నాయకులతో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం అన్ని కులాలకు తగిన పోత్సాహాన్ని అందజేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు ఎమ్మెల్సీ రాజును కలిశారు. భౌరంపేటలో నాయీ బ్రాహ్మణ సంఘానికి భవనం నిర్మించుకునేందుకు స్థలాన్ని కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్సీ త్వరలోనే నాయీ బ్రాహ్మణులు కోరుకున్నట్లుగా స్థలాన్ని కేటాయించేలా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వారితో మాట్లాడుతూ.. ఇప్పటికే నాయీ బ్రాహ్మణుల కోసం ప్రభుత్వం దుకాణాల్లో ఉచిత కరెంటును అందిస్తుందన్నారు. భౌరంపేట పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో పర్యటిస్తా..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కాలనీల్లో పర్యటించి ప్రజలకు కావాల్సిన సదుపాయాలు అందేలా చర్యలు తీసుకుంటానని శంభీపూర్ రాజు అన్నారు. శుక్రవారం ఆయనను కలిసేందుకు కుత్బుల్లాపూర్‌లోని వివిధ కాలనీల నుండి వచ్చిన ప్రజలతో ఆయన మాట్లాడి పనులు సక్రమంగా జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యేపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కుత్బుల్లాపూర్: ఎమ్మెల్యే వివేకానంద్‌పై ఫేస్‌బుక్ వేదికగా దుష్ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని శుక్రవారం కొంపల్లి మున్సిపల్ బీఆర్‌ఎస్ నాయకులు పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల కొంపల్లిలోని ఏఎంఆర్ గార్డెన్స్‌లో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం జరుపుకుంటుంటే కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన నల్ల జైశంకర్‌గౌడ్ అనే వ్యక్తి ఫేస్‌బుక్‌లో అసత్య ప్రచారం చేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా ఎమ్మెల్యే వివేకానంద్‌పై వ్యక్తిగత దూషణలకు దిగారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్న అతడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాకపోకలకు అడ్డుగా..



మారుతినగర్‌లో రోడ్డుకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభం

రంగారెడ్డినగర్: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారుతోంది. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ నుంచి మారుతీనగర్‌కు ప్రధాన రహదారిలో మారుతినగర్ కమిటీ హాలుకు ఎదురుగా ఉన్న గల్లీలో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం రాకపోకలకు ఆటకంగా మారుతోంది. ఈ విషయమై కాలనీ వాసులు పలుమార్లు విద్యుత్ అధికారులకు అర్జీలు పెట్టుకున్న స్పందించడ లేదు. ఎవరైనా ఇళ్ల మారే సమయంలో భారీ వాహనం లోనికి రాలేని పరిస్థితి నెలకొందని, సంబంధిత అధికారులు స్తంబాన్ని పక్కకు షిఫ్ట్ చేసి సమస్యను పరిష్కరించాలని ఆ గల్లీ వాసులు కోరుతున్నారు.

సత్యవాణి పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే



సర్టిఫికెట్లతో సత్యవాణి స్కూల్ యూకేజీ విద్యార్థులు

జీడిమెట్ల: ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల శిక్షణ ప్రోత్సాహం ఉంటే వారు అనుకున్న స్థాయికి పిల్లలు సులభంగా చేరుతారని టీవీఆర్ పాఠశాల సీనియర్ హిందీ ఉపాధ్యాయులు విశ్వనాథ్ తివారీ అన్నారు. శుక్రవారం ఎస్ఆర్ నాయక్‌నగర్‌లోని సత్యవాణి పాఠశాలలో యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీవీఆర్ మోడల్ స్కూల్ అకడమిక్ డైరెక్టర్ టి.వంశీకృష్ణారెడ్డి, విశ్వనాథ్ తివారీలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీపీ–2 పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.

రంజాన్ ప్రార్థనలకు ప్రత్యేక ఏర్పాట్లు



సాయినగర్‌లోని సర్వే నెంబరు 186లో రంజాన్ ప్రార్థనలకు సిద్ధం చేస్తున్న దృశ్యం..

నిజాంపేట్: రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకునేందుకు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బాచుపల్లి సాయినగర్‌లోని 186 సర్వే నెంబరులో ఉన్న ప్రభుత్వ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి కూర్చుని ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా జంబుఖానాలను పరుస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలోని ముస్లింలు సాయినగర్‌కు వచ్చి ప్రార్థనలు చేసుకోవాలని కార్పొరేషన్ అధికారులు ఓ ప్రకటనలో కోరారు. అదే విధంగా ప్రార్థనలు జరిగే ప్రాంతంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ బందో బస్తును ఏర్పాటు చేశారు.

ఆలుమగలు.. దొంగలించారు నగదు, నగలు

జీడిమెట్ల: ఇంటితాళం పగులగొట్టి నగదు, నగలు దొంగిలించిన భార్యాభర్తలను జీడిమెట్ల పోలీసులు రిమాండ్‌కు తరలించారు. డీఎస్సై అంజనేయులు వివరాల ప్రకారం.. ఈనెల 18వ తేదీన గాజులరామారం డివిజన్ ఓక్షిత్ కాలనీకి చెందిన తీపిరెడ్డి నరేందర్‌రెడ్డి కుటుంబంతో సహా పని నిమిత్తం సొంత గ్రామం జనగాంకు వెళ్లారు. మరునాడు ఉదయం తిరిగి వచ్చి చూసేసరికి వారి ఇంటితాళం పగులగొట్టి ఉంది. అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉంచిన రూ.60వేల నగదు, ఒక జత చెవి కమ్మలు కనిపించలేదు. దీంతో ఇంటి యజమాని అదేరోజు జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

ఫోన్‌కాల్ ఆధారంగా నిందితుల గుర్తింపు..

దొంగలను పట్టుకునేందుకు జీడిమెట్ల క్రైం పోలీసులు కాలనీలో ఉన్న సీసీ కెమెరాల్లో చూడగా నెంబరుప్లేట్ లేని ఆటో అనుమానస్పదంగా కాలనీలో తిరిగినట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. దొంగలు దొంగతనం చేసే క్రమంలో ఎలాంటి సెల్ ఫోన్ వాడలేదు. కాని ఆటోలో వచ్చిన వ్యక్తి దొంగతనం జరిగిన ఇంటికి సమీపంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌తో మాట్లాడినట్లు పోలీసులు గుర్తించారు. ఎందుకు మాట్లారో ఆరా తీయగా దొంగతనం చేసిన వ్యక్తి వాచ్‌మెన్ ఫోన్‌తో కాల్ మాట్లాడినట్లు పోలీసులు గుర్తించారు. ఫోన్ నంబర్ ఆధారంగా దొంగలు జగద్గిరిగుట్ట శ్రీనివాస్‌నగర్ చెందిన భార్యభర్తలు మధు(22), అరుణ(22)లుగా గుర్తించారు. అనంతరం ఇద్దరిని శుక్రవారం వారి ఇంటి వద్ద అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించగా దొంగతనం చేసినట్లుగా ఒప్పుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.43వేలు, ఒక జత చెవి కమ్మలను రికవరీ చేసి రిమాండుకు తరలించారు.

ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటున్నాం

ఎమ్మెల్యే వివేకానంద్



జీడిమెట్ల ఉడ్స్ ఎన్‌క్లేవ్ కాలనీలో తాగునీటి సదుపాయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ పరిధి ఉడ్స్ ఎన్‌క్లేవ్‌లో రూ.1.05 కోట్లతో ఏర్పాటు చేసిన మంచినీటి సదుపాయాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా తాగునీటి కోసం పడిన ఇబ్బందులను తొలగించిన ఎమ్మెల్యేను కాలనీవాసులు సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతున్నామని అన్నారు. సీఎం కేసీఆర్, పురపాలక మంత్రి కేటీఆర్‌ల సహకారంతో నిధుల లేమి లేకుండా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మౌలిక సదుపాయాలను మెరుగు పరుస్తూ ప్రజలకు సుఖమయమైన జీవనాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్ రెడ్డి, ఎస్‌ఐ రామకృష్ణ, జలమండలి మేనేజర్ రాజు, ఏఈ సురేందర్ నాయక్, వార్డు మెంబర్ ఇందిరారెడ్డి, కాలనీ ప్రెసిడెంట్ శివరామకృష్ణ, జనరల్ సెక్రటరీ తోట భిక్షపతి, నర్సింహారెడ్డి, కమల్ కిషోర్, శ్రీహరి రెడ్డి, స్వామి, పాండురంగ తదితరులు పాల్గొన్నారు.

- ప్రగతి యాత్రలో భాగంగా జీడిమెట్ల డివిజన్ పరిధిలోని భద్రసాయినగర్, వీరస్వామినగర్, బీరప్పనగర్‌లలో ఎమ్మెల్యే పాదయాత్ర నిర్వహించారు. అదే విధంగా జగద్గిరిగుట్ట డివిజన్ రింగ్‌బస్తీలో శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద రూ.20 లక్షల సీడీపీ నిధులతో నూతనంగా చేపడుతున్న కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులకు ఎమ్మెల్సీ మధుసూదనాచారితో కలిసి ఎమ్మెల్యే వివేకానంద్ శంకుస్థాపన చేశారు. గతంలో ఎన్నడూ జరగని విధంగా అన్ని కులాల వారికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం గుర్తింపు ఇస్తోందన్నారు. అందులో భాగంగా భూములను కేటాయించి కోట్లాది నిధులతో ఆత్మగౌరవ భవనాలను నిర్మిస్తోందన్నారు.